

జగనన్న సురక్ష అమలులో జిల్లా రెండో స్థానం

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్న సురక్ష పథకం అమలులో జిల్లాలో 92.7శాతం సర్వీసుల పరిష్కారంతో రాష్ట్రంలో రెండో స్థానంలో ఉన్నామని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లాలో నిర్వహించిన జగనన్న సురక్ష పథకంలో 16,320 సర్వీసులను వాలంటీర్ల యాప్‌లో నమోదు చేయగా, వాటిలో 10208 సమస్యలకు టోకెన్లు జారీ చేశామని తెలిపారు. 9047 సమస్యల పరిష్కారం నిమిత్తం విచారణ అనంతరం సిఫార్సు చేశామని, నేరుగా ప్రజల నుంచి 555 విన్నపాలు వచ్చాయని, 8390 రిక్వెస్ట్‌లను పరిష్కరించామని, 102 దరఖాస్తులను తిరస్కరించినట్లు కలెక్టరు తెలిపారు.

ఎండుతున్న నారు మడులు

- ఆందోళనలో అన్నదాతలు
- చినుకు కోసం ఎదురుచూపు
- మోటార్లతో కాపాడుకుంటున్న రైతన్నలు



చల్లంనాయుడువలసలో ఎండిపోతున్న నారుముడు

ప్రజాశక్తి - సీతానగరం

గత పది రోజులుగా వానలు ఎండగట్టడంతో అన్నదాత చినుకు కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాడు. జూన్ మొదటి, రెండువారాల్లో కురిసిన వర్షాలకు ఎంతో ఉత్సాహంతో వరి నారు, ఎదలు వేశారు. అయితే ఇటీవల పది రోజుల నుంచి వర్షాల్లేకపోగా, తీవ్రమైన ఎండలు కాయడంతో నారుమడులు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు మోటార్లు పెట్టి నారు మడులను కాపాడుకుంటున్నారు. ఇదే పరిస్థితి మరో రెండురోజులు కొనసాగితే వరినారును కాపాడుకోవడం కష్టమని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని రైతులు ఖరీఫ్ వరినారు, ఎదలను గతనెలలు వేశారు. అయితే పది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో వరి ఎదవలు పూర్తిస్థాయిలో ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల వేసిన వరినారు మొలకెత్తినప్పటికీ నీరు లేక ఎండిపోతున్నాయి. గత వారం రోజులుగా ఎండలు తీవ్ర స్థాయిలో ఉండడంతో చల్లిన విత్తనాలు మొలకెత్తడంలేదని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. అంతేకాక ఆకుమల్లు సాగు కోసం కుటుంబం యావత్తు రాత్రింబవళ్లు కష్టపడాల్సిన పరిస్థితి వచ్చింది. గతం ఎన్నడూ లేని విధంగా జులైలో ఇంత ఎండలు ఎప్పుడూ చూలేదని రైతులు చెబుతున్నారు. మండలంలోని లక్ష్మీపురం, బూర్జ, చల్లంనాయుడువలస, బుడ్డిపేట తదితర గ్రామాల్లో విద్యుత్ మోటార్ల ద్వారా పైపులైన్లు వేసి ఆకుమల్లులకు నీరు కట్టేందుకు కుటుంబ సభ్యులంతా కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు విద్యుత్ కోతలు ఉంటున్నాయని వాపోతున్నారు. విత్తనాలు వేసేందుకు దుక్కుల కోసం వేలాది రూపాయలు పెట్టుబడి పెడుతున్నామని, వరుణుడు కరుణించకపోవడంతో మొత్తం పెట్టుబడులంతా పోయి ఆర్థిక ఇబ్బందులకు గురవుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక సకాలంలో వర్షాలు పడకపోతే ఆహర ధాన్యాల కొరతకు తిప్పలు తప్పవని రైతులు వాపోతున్నారు. అవసరమైన విత్తనాలు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయకపోవడంతో అధిక ధరలకు ప్రైవేట్ వ్యాపారుల నుంచి కొనుగోలు చేసి చల్లుకునే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వరుణుడు కనికరించకపోతే కరువు తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మీపురంలో మోటార్లతో నారుమడి తడుపుతున్న రైతులు





అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న గిరిజన సంఘం నాయకులు; ఎస్ఎఫ్ ఆధ్వర్యాన జరిగిన సభలో మాట్లాడుతున్న ప్రముఖ కవి గౌరునాయుడు

అల్లూరి స్ఫూర్తితో పోరాడాలి

ప్రజాశక్తి - బెలగాం

గిరిజనులకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు అవలభిస్తున్న విధానాలకు నిరసనగా విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఆదివాసీ గిరిజనులంతా పోరాడాలని ఎపి గిరిజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీదరపు అప్పారావు, మండంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో మన్యంలో ప్రతి సమస్యను తీసుకొని గిరిజన సంఘం కార్యకర్తలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి, పువ్వల తిరుపతిరావు, మండంగి లక్ష్మణరావు, మండంగి అప్పారావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని స్ఫూర్తి అల్లూరి కీర్తి

కలెక్టరేట్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి, రచాయిత గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ వాడికి వ్యతిరేకంగా పోరాడడమే కాకుండా గిరిజనుల కోసం గిరిజనులకు చేసే దోపిడీలకు వ్యతిరేకంగా అందర్నీ ఐక్యం చేసి తిరుగుబాటు చేశాడని అన్నారు. సీతారామరాజు కోరుకొనే స్వాతంత్ర్యం ఇది కాదని, నేటి పాలక వర్గాలు పోరాటాలు లేకుండ చేస్తుందని వాపోయారు. ప్రశ్నించే వారిపై దాడిచేస్తుందని,

జయంతి సభలో వక్తలు

మతపరమైన విబేధాలు సృష్టిస్తుందని, సమాజాన్ని తిరోగమనం వైపు తీసుకుపోతుందని మండిపడ్డారు. ఈ వ్యవస్థ మారాలని, అందుకు నేటితరం అలోచించి అల్లూరి జయంతులు, వర్ధంతిలు సందర్భంగా ఒక వేదికగా ఏర్పాటు చేసుకొని ఈ వారసత్వని ముందుకు తీసుకువెళ్లాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాల చరిత్ర అధ్యాపకులు మాట్లాడుతూ నేడు చరిత్రని వక్రీకరించి కొన్ని ముఖ్యమైన పాఠ్యాంశాలు తొలగిస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో రాబోయే తరాలకు చరిత్ర అంటే తెలియని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది చాలా ప్రమాదమని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాజు మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో విద్యారంగంపై వస్తున్న సమస్యలపై చేపడుతున్న పోరాటాల్లో అందురూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలని, విద్యారంగంపై వస్తున్న సమస్యలపై స్పందించి మద్దతుగా రావాలని అప్పుడే అల్లూరి కీర్తి, ఆశయని సాధించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరాడ : మండల కేంద్రమైన కొమరాడలో అల్లూరి సీతారామరాజు జయంతి నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు హెచ్.రామారావు, లక్ష్మ, రెడ్డి శివున్నాయుడు, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాలో 37 మంది ఎంపిక

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఆవరణంలో మినీ జాబ్ మేళా మంగళవారం నిర్వహించారు. ఈ మేళాకు సిగ్నట్ స్పెక్ట్రరం టెక్నాలజీస్, ఎంఎస్ఎన్ లేబొరేటరీస్, ముతూట్ ఫైనాన్స్ ప్రతినిధులు హాజరయ్యారు. మేళాకు సుమారు 111 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా వీరిలో 37మందిని ఎంపిక చేసినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. అనంతరం కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్.చలపతిరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇది ఎనిమిదో సారని, ఇలాంటివి భవిష్యత్తులో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎపిఎస్ఎస్‌డిసి సిబ్బంది పాల్గొన్నారు.

6న జునోసిస్ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ జునోసిస్ దినోత్సవం ఈ నెల 6న నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక అధికారి బి.శ్రీనివాస రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అన్ని పశువైద్య కేంద్రాల్లో ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, రేబిస్ వ్యాధి సోకకుండా టీకాను ఉచితంగా ఇస్తున్నామని ఆయన వివరించారు. జంతు ప్రేమికులు ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు.

డెంగీపై అవగాహన అవసరం : డిడి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

డెంగీ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగివుండాలని మలేరియా, ఫైలేరియా నివారణా ఉప సంచాలకులు టి.రామనాధం తెలిపారు. ఈ నెల 1 నుంచి 31 వరకు జరిగే జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని నాలుగు రోడ్ల కూడలి వరకూ డెంగీ వ్యాధిపై నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టి.రామనాధం మాట్లాడుతూ డెంగీ ప్రాణాపాయం తో కూడుకొన్న వెక్టర్ వల్ల సంక్రమించే వ్యాధని తెలిపారు. ఈ వైరస్ వెస్ట్ నైల్ ఇన్ఫెక్షన్, జ్వరానికి సంబంధించిందని, డెంగీ వైరస్ ఎడిస్ దోమ కుట్టడం ద్వారా ఈ జ్వరం వ్యాపిస్తుందని వివరించారు. డెంగీ ఫీవర్ వ్యాపించిన ఆరు రోజుల తర్వాత దాని లక్షణాలు కనిపిస్తాయన్నారు. తీవ్రమైన తలనొప్పి, కీళ్ల నొప్పి, కండరాల నొప్పి, వికారం, అలసిపోవడం, జ్వరం, వాంతులు ఐదు రోజుల తర్వాత చర్మంపై దద్దుర్లు కలుగుతాయని పేర్కొన్నారు. డెంగీ వ్యాధి రాకుండా ఉండాలంటే ఇంటి చుట్టూ పక్కా ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లో ఉన్న ట్యాంక్, బారెల్, డ్రమ్ముల్లో నీటిని తప్పనిసరిగా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏడిస్ దోమలు పగటిపూట కూడతాయని, కాబట్టి పిల్లలు, వృద్ధులు, మధ్యాహ్నం విశ్రాంతి తీసుకొనే మహిళలు దోమ తెరలు ఉపయోగించాలని సూచించారు. డెంగీ సోకినా



ర్యాలీని ప్రారంభిస్తున్న ఫైలేరియా, మలేరియా నివారణాధికారి రామనాధం

వ్యాధిగ్రస్తులు వెంటనే ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి జి.వెంకట రమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహన్ రావు, డిఎల్ఒ శ్యామ్ కుమార్, మలేరియా అధికారి డి.సత్యనారాయణ, శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డెంగీ మలేరియా నివారణ మహోత్సవాలు సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బి.రవీంద్ర కుమార్ గిరిజనులకు మలేరియా, డెంగీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్ రావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై దష్టి పెట్టాలి

వీరఘట్టం : ఇటీవల కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రభల్లే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని తరచుగా గ్రామాలు సందర్శించాలని వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతుల సమాచారం ఇవ్వాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ఎక్కడైనా అధికంగా జ్వరాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకొస్తే అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పార్వతి, శాంతికుమారి, నయోమి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నాం



వండవలో సచివాలయ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులు త్వరితగతిని పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చిట్టిపూడివలస, వండువ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి నిర్మాణంలో ఉన్న విలేజ్ హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, సచివాలయాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని నిర్మిస్తున్న భవనాలను వీలైనంత త్వరగా పూర్తిచేసి వినియోగంలోనికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులకు నిధులు కొరతలేదని, జరిగిన మేరకు బిల్లులు కూడా చెల్లింపులు జరుగుతున్నాయని అన్నారు. సిమెంటు కొరత లేదన్న పరిస్థితి రాకూడదన్నారు. అత్యవసర సమయంలో స్థానికంగా సిమెంట్ కొనుగోలు చేసి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన నిర్మాణ సామాగ్రిని ముందస్తుగా సిద్ధం చేసుకొనేలా చర్యలు తీసుకుని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డి.కల్యాణదుర్గను ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణంలో పాటించడంతో పాటు క్యూరింగ్ పనులపై శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన సమయంలోగా పనులు పూర్తి అయ్యేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. కలెక్టర్ వెంట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి, మండల ప్రత్యేక అధికారి పి.కిరణ్‌కుమార్, తహశీల్దారు సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ జి.జయంతిప్రసాద్, సచివాలయాల కార్యదర్శులు నల్ల శివ, మణికంఠ, భవానీశంకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా జాతి వెలుగు మానుకొండ

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్త్రీలకు సమాన హక్కులు కావాలని, బాల్య వివాహాలు నిషేదించాలని, మూఢ విశ్వాసాలపై మహిళా జాతిని సంఘటితం చేసి మహిళల్లో పోరాట పటిమను తీసుకొచ్చిన మహాశక్తి మానుకొండ సూర్యావతి అని ఐద్వా మండల నాయకులు అరిక నారాయణమ్మ అన్నారు. సూర్యావతి 30వ వర్ధంతి సందర్భంగా సాలూరు రూరల్ ఐసిడిఎస్ పాజెక్టు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేస్తూ నివాళ్లుఅర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సూర్యావతి జీవితం మహిళా లోకానికి వెలుగు అని, ఆమె పోరాట పటిమ ఎందరో మహిళలకు ఆదర్శమని అన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలను తరిమికొట్టవచ్చని, అమె పోరాట పటిమను మనమంతా చూపించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, పుష్ప, అంగన్వాడీ నాయకులు అరుణ, అనసూయ, సత్యవతి పాల్గొన్నారు.



పోరుయాత్రకు మద్దగా పట్టణంలో ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పోలవరం పోరుయాత్రకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి -సాలూరు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన మహాపాదయాత్రకు ప్రజాసంఘాలు మద్దతుగా నిలవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు కోరారు. ఆయన ఆధ్వర్యాన సిఐటియు, డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాలు సంఘీభావ ర్యాలీ మంగళవారం నిర్వహించాయి. భద్రాచలం జిల్లా గెల్లపాకలో జూన్ 20న ప్రారంభమైన పాదయాత్ర 15మండలాలు, 230గ్రామాల మీదుగా సాగుతూ ఈరోజుతో ముగిసిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితుల సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితుల కు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల పట్ల బిజెపి, వైసిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.రాముడు, టి.శంకర్, ఐద్వా నాయకులు స్వప్న, సీత, డివైఎఫ్ఐ నాయకులు కేశవ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకొని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పట్టణంలోని 6,7 వార్డులకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శివాలయం వీధిలో గల సీతారామ ధర్మశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని చాలావరకు పరిష్కరించినట్లు తెలిపారు. అప్పుడు అందుబాటులో లేని ప్రజలు ఇప్పుడు సురక్ష కార్యక్రమంలో సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. పేదలకు అవసరమైన ధ్రువపత్రాలు పంపిణీతో పాటు సమస్యలు పరిష్కరించనున్నామని చెప్పారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్లమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పల నాయుడు, పట్టణ వైసిపి మాజీ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, కమిషనర్ హెచ్.శంకరరావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని బూర్జ, చినభోగిలిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ కొత్తగా మంజూరైన 11రకాల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే ఆర్జీదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రవణమ్మ, శ్రీరాములు నాయుడు, జడ్పిటీసి ఎం.బాబ్జీ, జెడ్పీ మాజీ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, బి.ఈశ్వరనారాయణ, గ్రామ సర్పంచ్లు దాసు, కె.రాధ శ్రీనివాసు, ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్, ఆర్ఐ శ్రీనివాసు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కురుపాం : ప్రజల సమస్యలు సచివాలయం వద్దే పరిష్కారం చూపేందుకే జగనన్న సురక్ష పథకం ముఖ్యోద్దేశమని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. మండలంలోని గుజ్జువాయిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా అర్హులై ఉండీ సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు, డిపిఒ బి.సత్యనారాయణ, ఎంపిడిఒ వివి శివరామప్ప, మాజీ ఎంపిపి ఇందిరాకుమారి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కొండాడ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 11 అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పించి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ ఎస్.సింహాచలం, ఎంపిడిఒ కొండపల్లి సత్యం, డిటి నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.


భామిని : మండలంలోని బత్తిలి, లివిరి సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపిపి తోట సింహాచలం నిర్వహించారు. కార్యక్రమంలో జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, అన్నాజీ రావు, తహశీల్దార్ అప్పారావు, డిటి శేఖరం, లివిరి సర్పంచ్ బౌరి సౌదమిని, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, ఎంపిడిఒ చంద్రరావు ఉన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని నాగురులో ఎంపిపి ఉరిటి రామారావు ఆధ్వర్యాన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. జగనన్నసురక్ష పథకం ద్వారా మంజూరు చేసిన ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, ఎంపిడిఒ జి.పైడితల్లి, డిప్యూటీ తహశీల్దార్ పెల్లూరి సత్యలక్ష్మికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలో పెదబొండపల్లి సచివాలయం పరిధిలో నేడు జరిగిన జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. తొలుత గత వారం రోజులుగా గ్రామంలో గల ప్రతి ఇంటికీ వాలంటీర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు నాయకులంతా కలిసి వెళ్లి కుటుంబంలో గల ప్రతి సభ్యుడ్ని కలిసి వారికి ఏదైనా సమస్యలుంటే అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న 11 సేవలలో భాగంగా ఆర్జీ పెట్టుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే ధ్రువపత్రాలు అందజేశారు. ఇవేకాక ఇంకా సమస్యలుంటే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు శోభా హైమవతి, మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, మండలం అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, లబ్ధిదారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం మండలంలోని దశమంతపురం, చిట్టిపూడి వలసలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంల ప్రత్యేకాధికారి అర్జీదారులకు వివిధ రకాలైన ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు వావిలపల్లి ఉషారాణి, కె.పాపమ్మ తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఎంపిడిఒ జి.జయంతి ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు కె.సునీల్ కుమార్, నల్ల శివ, విఆర్ఒలు జి.రాజేంద్రప్రసాద్, భాస్కరరావు, గ్రామపెద్దలు లక్ష్మణ్, వి.హరిబాబు, ఎంవెంకటరమణ,, ఆర్.శ్రీనివాసరావు సచివాల సిబ్బంది ,వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి పాల్గొన్నారు. అనంతరం వివిధ రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి, జెసిఎస్ కన్వీనర్ కల్లేపల్లి త్రినాధ్ నాయుడు, సర్పంచ్ సువ్వాడ శశికళ, తహశీల్దారు బాల మురళీకృష్ణ, వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, నాయకులు సువ్వాడా రామకృష్ణ, శ్రీనివాస రావు, పెద్దింటి మాధవ రావు సెక్రెటరీ ప్రవీణ్ కుమార్,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారునికి ధ్రువపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర





సీతానగరం : లబ్దిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు; కురుపాం : గుజ్జువాయిలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి



రవీంధ్రనాథ్ దంపతులను సన్మానిస్తున్న బంటువానివలస గ్రామపెద్దలు

రవీంద్రనాథ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని నిర్వాసిత గ్రామమైన బంటువాని వలస ప్రాథమిక ఉపాధ్యాయునిగా పని చేసిన పక్కి రవీంద్రనాథ్ మాస్టారు సేవల ప్రశంసనీయమని అడ్డాపుశీల మాజీ సర్పంచ్ బంటు దాసు కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసిన ఆయన ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన్ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం బంటు దాసు మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఉపాధ్యాయుడుగా పనిచేసిన కాలంలో పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు కె.సింహాచలంతో పాటు గ్రామస్తులు రవీంద్ర నాథ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పి.శివున్నాయుడు, జి.సూర్యనారాయణ, బిఎ సరస్వతి, కె.రత్నం, బి.శశికుమార్, జి.సింహాచలం, కోటవానివలస పాఠశాల ఉపాధ్యాయులు పి.వెంకట నాయుడు, కె.తూతుకేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

వర్షాకాలం ప్రవేశించిన దృష్ట్యా పల్లెల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి, దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్న దృష్ట్యా గ్రామాల్లో ఫాగింగ్ చేసేందుకు దోమల నివారణ పొగ యంత్రాలు మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ యంత్రాలను సంబంధిత సచివాలయం కార్యదర్శులకు త్వరలోనే అందజేయనున్నట్లు ఎంపిడిఒ ఎస్.రమేష్ తెలిపారు. తొలి విడతగా మండలంలోని గోపాలపురం, వెంకటరాయుడిపేట, ఆడారు, బుదురువాడ, గోచక్క, కవిటిభద్ర, సూడిగాం, జమ్మిడివలస, వెలగవలస, నర్సిపురం, పులిగుమ్మి, రావికోన పంచాయితీలకు అందజేయనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

హౌసింగ్ కార్పొరేషన్ డే వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. హౌసింగ్ సిబ్బంది అంతా పాల్గొని రక్తదానం చేపట్టారు. హౌసింగ్ కార్పొరేషన్ డే సందర్భంగా రక్తదానం చేయడం ఎంతో మందికి ఉపయోగపడుతుందని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి తెలిపారు. రక్తదానం చేసిన అందరికీ ఆమె అభినందించారు.



సూర్యనారాయణను సన్మానిస్తున్న జిసిసి అధికారులు

జిసిసి రిటైర్డ్ అకౌంటెంట్‌కు సన్మానం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక జిసిసి బ్రాంచ్ రిటైర్డ్ అకౌంటెంట్ దాసరి సూర్యనారాయణను జిసిసి డిఎం వి.మహేంద్రకుమార్, బిఎం జె.రామారావు సన్మానించారు. జూన్ 30న ఉద్యోగ విరమణ చేసిన సూర్యనారాయణను జిసిసి బ్రాంచ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళవారం వారు దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా డిఎం మహేంద్ర కుమార్, బిఎం రామారావు మాట్లాడుతూ సూర్యనారాయణ విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేశారన్నారు. సన్మాన గ్రహీత సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ ప్రస్థానంలో తనకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిసిసి ఉద్యోగుల సంఘం నాయకులు శ్యామలరావు, జూనియర్ అసిస్టెంట్ గొంతెమ్మ, బి.కన్నంనాయుడు, సేల్స్ మాన్ లు పాల్గొన్నారు.

క్వారీ యాజమాన్యం ఆగడాలు అడ్డుకోండి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పార్వతీపురం సమీపాన గల కొంకిడివరం, పెదగుడబ పరిసరాల్లో ఉన్న క్వారీ యాజమాన్యం ఆగడాలను అరికట్టాలని కొంకిడివరం సర్పంచ్ అల్లు అప్పలనాయుడు, జనసేన పార్టీ కార్యనిర్వాహణ రాష్ట్ర కార్యదర్శి బాబు పాలూరు, వంగల దాలి నాయుడు, బలిజిపేట మండల అధ్యక్షులు బంకురు పోలి నాయుడు, తెంటు శ్రీకాంత్, చింతాడ కామేష్, అలజింగి సింహాచలం, యోగి రెడ్డి అప్పలనాయుడు, అల్లు హరికష, గౌరీ శంకర్, రఘు మండల అప్పలనాయుడు, చిట్ల గణేష్ , చీమల సతీష్, నేరేడు బిల్లీ వంశీ, రమేష్ తదితరులు ఎఎస్‌పి దిలీప్‌కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీ అనుమతుల్లేకుండా యాజమాన్యం తారు, సిమెంట్, బ్లాస్టింగ్, క్రషర్ తదితర కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఆయా కార్యక్రమాలకు గానూ క్వారీ నుండి గ్రామాల సమీపంలో ప్రైవేటు వ్యక్తుల తోటలో మొక్కలు తొలగించి రోడ్డు వేసి దౌర్జన్యంగా వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఆయా వాహనాలు రాకపోకల వల్ల పెదగుడబ, కొంకడివరం తదితర గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. బ్లాస్టింగ్ చేసేటప్పుడు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తిరిగి కేసులు పెడుతున్నారన్నారు. తక్షణమే దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఎంఇఒలో

ఎమ్మెల్యేను కలిసిన కొత్త ఎంఇఒలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన మండల విద్యాశాఖాధికారులు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని విద్యారంగంలో ముందువరుసలో నిలపాలన్నారు. మండలాల్లో విద్యారంగ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బలిజిపేట, పార్వతీపురం, సీతానగరం ఎంఇఒలు సామల సింహాచలం, కె.శ్రీనివాసరావు, వై.విమలకుమారి, కర్రి ప్రసాదరావు, సూరి దేవుడు, ఎం.వెంకటరమణ ఉన్నారు.

జగనన్న అమ్మఒడి విద్యార్థులకు వరం

రామభద్రపురం: అమ్మఒడి విద్యార్థుల భవితకు ఒక వరం వంటిదని ఎమ్మెల్యే ఎస్. చిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న అమ్మఒడి నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మండలానికి విడుదలైన అమ్మఒడి నిధులు రూ.6.99కోట్లు నమూనా చెక్కును విద్యార్థులు తల్లులకు అందజేశారు. కొందరు తల్లిదండ్రులు రాగి జావ పంపిణీ పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ రాగిజావ నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని మెను ప్రకారం అందజేయడం లేదని రుచి, శుచి లేకపోవడంతో తమ పిల్లలు తాగేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు.

అల్లూరి జీవితం యువతకు స్ఫూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

అల్లూరి సీతారామరాజు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశం కోసం, ప్రజల కోసం పనిచేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జయంతిని ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించిందన్నారు. అసంబద్ధమైన బ్రిటీషు చట్టాలకు వ్యతిరేకంగా, అమాయకులైన గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేసిన, గిరిజనుల జీవితాలలో మార్పుకోసం పాటుపడిన అల్లూరిని స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవచేయాలని తెలిపారు. గిరిజనులు ఎక్కువగా గల మన జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, వారి జీవితాల్లో మార్పులు తీసురావడానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో డిపిఆర్ఒ ఎల్.రమేష్, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్ లు శ్రీరామ్మూర్తి, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 124వ జయంతి కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆధ్వర్యాన జరిగింది. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి దిబ్బా రూబెన్, టౌన్ ప్లానింగ్ అధికారి పి.కనకారావు, ఆర్ఐ పి.నారాయణరావు, జెఎఒ, ఎఇ సన్యాసిరావు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని స్థానిక టిడిపి కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గర్భాపు ఉదయభాను, గరిమెళ్ళ భానుప్రసాద్, డాక్టర్ ద్వారపురెడ్డి



అల్లూరికి నివాళ్లు అర్పిస్తున్న టిడిపి నాయకులు

అల్లూరికి రాజన్నదొర ఘన నివాళి

సాలూరు: బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి డిప్యూటీ సిఎం రాజన్నదొర పూలమాల వేసి నివాళులర్పించారు. తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో తెల్లదొరలు గిరిజనులకు చేసే అన్యాయాన్ని ఎదురించి పోరాడిన అల్లూరి సీతారామరాజు ఎన్నటికీ ఆదర్శప్రాయుడని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పట్టణ వైసిపి మాజీ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

తిరుపతిరావు, మండల అధ్యక్షులు దొగ్గ మోహన్‌రావు, పట్టణ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, కౌన్సిల్ సభ్యులు కోల మధుసూదనరావు, బడే గౌరునాయుడు, పాలకొండ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ జనార్ధన్ రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు. డి. పండు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్ల దొరల చేతుల్లో అనేక దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారని, పేదల కోసం చైతన్యపర్చి విప్లవకారులుగా తీర్చిదిద్దారని, ఆ రకంగా విద్యార్థి దశ నుండే ప్రశ్నించేతత్వం రావాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సదస్సు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మీసాల సూర్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు టి.భాస్కర్, కాలేజీ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీతంపేట : మన్యం ప్రజల హక్కుల కోసం, వారికి జీవన విధానంలో మార్పు



అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే

తేవడానికి తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అల్లూరి సీతారామరాజు అంటే ఒక మనిషి కాదని, సమ్మోహన శక్తి అని, పోరాటాల స్ఫూర్తి తిరగబడ్డ తెలుగోడి కీర్తి అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి లక్ష్మి, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, వైస్ ఎంపిపిలు కె.సరస్వతి, ఎం.విజయలక్ష్మి, సర్పంచ్ ఎ.కళావతి, ఎంపిటిసి సభ్యులు చంద్రశేఖర్, ఉపసర్పంచ్ పాలవలస బృందావతి, జెఎసి నాయకులు బి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారతి ఇంటర్నెట్ స్కూల్లో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

మండలంలోని పులిపుట్టి సమీపాన గల భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో అల్లూరి సీతారామరాజు 126 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి వేషధారణలో విద్యార్థులు అలరించారు. అల్లూరి జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ అల్లూరి జీవిత చరిత్ర గురించి క్లుప్తంగా వివరించారు. విద్యార్థులు ఆయన స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మురళీమోహన్, మోహన్‌రావు, మురళీ, సంతోష్, దివాకర్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండల పరిధిలోని నాగూరులో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు విగ్రహానికి అక్కేన సత్యనారాయణ నాయుడు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని అల్లూరి సీతారామరాజు 126వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టపూడివలసలో ఎంపిడిఒ జి.జయంతి ప్రసాద్, సర్పంచ్ కుప్పిలి పార్వతి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కంబర వలస ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.పైడిరాజు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి 36 గంటలు ధర్నా

ప్రజాశక్తి - కొమరాడ

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈనెల 10, 11న తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీ సమస్యలపైన 36 గంటలు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద నిరసన కార్యక్రమం మంగళవారం జరిగింది. నిరసన కార్యక్రమం అనంతరం సిడిపిఒ సుగుణమ్మకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్షులు సిహెచ్ గౌరమ్మ, మల్లేశ్వరి, లలిత, పద్మ, రత్నకుమారి, లక్ష్మి, పార్వతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒలుగా విమల కుమారి, ప్రసాద్

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను మండల విద్యాధికారులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం కారణంగా ఎంఇఒ-1గా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసిన యందవ విమలకుమారి, ఎంఇఒ-2గా బలిజిపేట మండలం నారాయణపురం ఉన్నత పాఠశాలలో పనిచేసిన కర్రి ప్రసాదు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వీరి ఇరువురు మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు.

ఉద్యమ నిర్మాత 'గంటి'

ప్రజాశక్తి - బొబ్బిలి

ఉత్తరాంధ్ర కార్మిక ఉద్యమ నేత గంటి ప్రసాదం అని ఇప్టా రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, విరసం రాష్ట్ర నాయకులు పాణి, అమరుల బంధు మిత్రుల సంఘం నాయకులు పద్మకుమారి అన్నారు. గంటి ప్రసాదం భవనంలో మంగళవారం గంటి ప్రసాదం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ గంటి ప్రసాదం బొబ్బిలి, సాలూరు ప్రాంతాల్లో కాకుండా, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో కార్మిక ఉద్యమాన్ని నిర్మించారని కొనియాడారు. బొబ్బిలిలో అధిక వేతనాలు సాధనలో గంటి ప్రసాదం పాత్ర కీలకమన్నారు. ప్రజల జీవన పరిస్థితి మెరుగు కోసం ఆర్థిక పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసం పని చేసిననాడే గంటి ప్రసాదంకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సిసి డ్రెయిన్ల నిర్మాణ పనులు పరిశీలన

బొబ్బిలి : మున్సిపాలిటీ పరిధిలో 10వ వార్డు గొల్లపల్లి గ్రామంలోని సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్మెన్ సావు వెంకట మురళీ కృష్ణారావు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, మహేష్, హరి కుమార్, 10వ వార్డ్ వైసిపి ఇంఛార్జి తుట్ట తిరుపతి, మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరమణ, పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలు చేయాలి : డిఐఒ

ప్రజాశక్తి - సీతానగరం

గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డిఐఒ) టి.జగన్మోహన్ అన్నారు. మండలంలోని సీతానగరం, పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశాడే సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలన్నారు గర్భిణీలు, పిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారి తల్లులకు వివరించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. టీకా కార్డుల్లో గడువు తేదీలు పక్కాగా నమోదు చేసి చిన్నారుల తల్లులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కె.శిరీష. ఎం.రాధాకాంత్, సిబ్బంది సత్యవతి, వరలక్ష్మి, జి.సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆశాలకు అవగాహన కల్పిస్తున్న డిఐఒ జగన్మోహన్

ఆర్‌టిసి డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పాలకొండ

ఆర్‌టిసి డ్రైవర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఎపిపిటిడి డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్ మూర్తి అన్నారు. తీర్మానించింది. మంగళవారం స్థానిక వైఎస్సార్ కూడలిలో గల శ్రీనివాసా కల్యాణ మండపంలో ఎపిపిటిడి డ్రైవర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్ మూర్తి మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ఉన్నప్పటి కంటే ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన తర్వాత డ్రైవర్లకు కష్టాలు ఎక్కువయ్యాయన్నారు. డ్రైవర్లకు టిమ్‌లు ఇచ్చి డ్రైవర్ డ్రైవింగ్ చేస్తూ ప్రయాణికులకు టికెట్లు ఇవ్వాలని డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు బలవంత పెడుతున్నారని అన్నారు. అలా ఉద్యోగం చేయలేనన్న డ్రైవర్లను తప్పుడు రిపోర్టులు రాయించి సస్పెండ్ చేస్తున్నారన్నారు. కండక్టర్లు పనికి వెళ్లకుండా తన వెనుక తిప్పుకొని ఏ విధమైన పని చేయకుండానే జీతం ఇస్తున్నారన్నారు. డిజిటల్ చార్ట్ అని చెప్పి మోసగిస్తున్నారని, కండక్టర్లకు నచ్చిన డ్యూటీలు డిఎం దగ్గరుండి వేయిస్తున్నారని, డ్రైవర్లపై పనిభారం పెంచి శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పెడుతూ దీర్ఘకాలిక రోగాల బారినపడేలా చేస్తున్నారని అన్నారు. మూడు, నాలుగు గంటలు ఆలస్యంగా బస్ ఇచ్చినా సరే పూర్తి కిలోమీటర్లు తిరగాలని లేనిచో జీతం కట్ చేస్తామని, ఇంకా గట్టిగా మాట్లాడితే సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. సీనియారిటీ ప్రకారం డ్యూటీలు వేయకుండా వారికి నచ్చినట్టు డ్యూటీలు వేసి డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీనిపై మంచి నిర్ణయం తీసుకొని అందరికీ సమన్యాయం జరిగేలా డిఎం చర్యలు చేపట్టకపోతే భవిష్యత్‌లో పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డిఎస్ కుమార్, కాకినాడ డిపో కార్యదర్శి లక్ష్మణరావులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డ్రైవర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మూర్తి

నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా పాలకొండ డిపో డ్రైవర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్.కె.రావు, ప్రెసిడెంట్‌గా కె.పి.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా డిఎస్ రావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.రవి, కార్యదర్శిగా ఎం.ఎం.రావు, సంయుక్త కార్యదర్శిగా బి.రమేష్, పబ్లిసిటీ కార్యదర్శిగా ఎస్.వి.బి.రావు, గ్రీవెన్స్ కార్యదర్శిగా ఎస్.ఆర్.రావు, జాయింట్ కార్యదర్శిగా బి.బి.రమణ, ఖజానాధికారిగా సిహెచ్ జోసఫ్, ఖజానాధికారిగా-2గా వి.ఎస్.చలం, కమిటీ సభ్యులుగా ఇసిహెచ్ బాబు, వి.వి.రావు, ఎ.వి.రావు, జి.కె.రావు, బి.వి.రాజు, కె.ఎన్.బి.రావు, జిఎస్ చలంను ఎన్నుకున్నారు.



సిహెచ్‌డబ్ల్యులు, ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఈశ్వరరావు

సిహెచ్‌డబ్ల్యుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఆశా కార్యకర్తల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సి ఆవరణలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలం, ఏజెన్సీ గ్రామాల్లోనూ, హిల్ టాప్ గిరిజన ప్రాంతాల్లో ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. ఆశా వర్కర్లకు పనికి తగ్గ వేతనం లేక దుర్భరమైన బతుకులు బతుకుతున్నారని, రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని అన్నారు. ఆశా వర్కర్లతో సమానంగా పని చేసిన సిహెచ్‌డబ్ల్యుకు ఆశాలతో సమానంగా వేతనం ఇవ్వాలన్నారు. జనాభాకు అనుగుణంగా వైద్య సిబ్బందిని పెంచాలన్నారు. మండలంలో సరిపడా ఎఎన్ఎంలను నియమించాలన్నారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలకు బడ్జెట్ కేటాయింపులు పెంచి సరిపడా మందులు అందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు యూనిఫాం కిట్లు పంపిణీ చేయాలని, ఆశాలతో సమానంగా వేతనం ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు



ఘటనా స్థలంలో మృతి చెందిన పైడిరాజు

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి- రామభద్రపురం

విద్యుత్తు షాక్‌తో ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన పైడిరాజు(45) ఘటనా స్థలంలోనే మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు. పొలంలో ఆవులకు గడ్డి కోసి తెచ్చేందుకు ఉదయం వెళ్లిన పైడిరాజు మధ్యాహ్నం భోజన సమయానికి కూడా ఇంటికి రాక పోవడంతో బార్య పోలమ్మ, బంధువులు పొలాల్లో వెతకడంతో జొన్న సేను గట్టు దగ్గర విగతజీవిగా పడి ఉన్న పైడిరాజును గుర్తించారు. పక్కనే విద్యుత్ పోల్ నుంచి తెగి పడిన వైరు పైడిరాజు కాలికి చుట్టు కొని ఉంధి నడిచి వెళుతున్న పైడిరాజు కాలికి తెగి పడిన విద్యుత్ వైరు తగలడంతో షాక్ తగిలి మృతి చెందారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విద్యుత్ శాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బాడంగి సిహెచ్‌సికి తరలించారు.

పశు నష్టపరిహారం విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పశు నష్టపరిహారం కింద రూ.2.08 కోట్లు విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పశు నష్టపరిహారం పథకం 2019 నుంచి 2022 డిసెంబరు వరకు అమలులో ఉండేదని ఆయన చెప్పారు. పశువులు సహజంగా గాని, ప్రమాదవశాత్తు గాని, జంతు దాడులలో గాని మృతి చెందితే వాటికి నష్టపరిహారం ఇస్తామని స్పష్టం చేశారు. జిల్లా ఏర్పడక ముందు 403 పశువులు మృతి చెందినట్లు ధ్రువీకరించడం జరిగిందని, వాటికి రూ.1.01 కోట్లు నష్టపరిహారం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. జిల్లా ఏర్పడిన అనంతరం 290 పశువులు మృతి చెందినట్లు ధ్రువీకరించడం జరిగిందని, వాటికి రూ.1.06 కోట్లు నష్టపరిహారం వెరసి రూ.2.08 కోట్లు నష్ట పరిహారం వచ్చిందని ఆయన చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయ్యాయని, రైతుల ఖాతాల్లో జమ కానుందని జిల్లా కలెక్టర్ వివరించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పేదల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని కురుపాం ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని లోవ ముఠా ప్రాంతమైన నెల్లికెక్కువ పంచాయితీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, గిరిజనులు ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జడ్పిటిసి రాధిక, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడ గౌరీశంకరరావు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు విత్తనోత్పత్తి దోహదం

ప్రజాశక్తి - సీతానగరం

ఎంటియు 1064 ఫౌండేషన్ రకం విత్తనాలు రాబోయే కాలానికి ఉపయోగపడ్డానికి విత్తనోత్పత్తి పథకం ఉపయోగపడుతుందని మండల వ్యవసాయ అధికారి అవినాష్ అన్నారు. మండలంలోని ఏగోటివలసలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా రైతులతో కలిసి నారుమడులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏగోటివలసలో 25మంది రైతులతో 25 ఎకరాల్లో వేసిన నారుమడులను పరిశీలించారు. ఈ ఫౌండేషన్ విత్తనాల కోసం రైతులు మూడు కాలాల పాటు రైతులు విత్తనాలు కట్టుకోవచ్చని తెలిపారు. అలాగే ఎంఐయు 1064 రకం రైతులు మండలం లో 50శాతం పండిస్తున్నారన్నారు. అలాగే దీని కాలపరిమితి 150 రోజులని తెగుళ్లను తట్టుకుంటుందని, దిగుబడి కూడా ఎకరాకు -32 బస్తాలు పైబడి పండుతుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు.



వరి నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి, సిబ్బంది